ఈ నెల 30 నుండి ఫిబ్రవరి 7 వరకు

మాతంగి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక హోమాలు

కాకినాడ,మేజర్‌న్యూస్ : 30 నుండి మాతంగి హోమాలు కాకినాడ జనవరి 27 వేద విజ్ఞాన ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో ఈనెల 30 నుండి ఫిబ్రవరి 7 వరకు మాతంగి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక హోమాలను నిర్వహిస్తున్నట్లు ప్రతిష్ఠానం ప్రతినిధి డాక్టర్ పుసులూరి ఫణిశర్మ తెలిపారు. ప్రతిష్ఠాన వ్యవస్థాపకులు డాక్టర్ చెరుకుపల్లి లక్ష్మీనరసింహ శర్మ ఆశీస్సులతో మాఘమాస సందర్భంగా శ్యామలాదేవి నవరాత్రులను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం హోమాలు నిర్వహించబడుతుందని తెలిపారు. స్థానిక రామారావుపేట యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న ప్రతిష్ఠాన కార్యాలయంలో ఈ విశేష పూజా కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటు చేయబడిందని ఆయన తెలిపారు. భక్తులు పాల్గొనదచినవారు ముందుగా వారి వివరాలను తెలియపరచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. శర్మ 99666 18322, మరియు దత్తాత్రేయ శర్మ 94946 63775 సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. శ్యామల నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను రాజేష్ మరియు సత్తిబాబుతోపాటు పలువురు కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే హోమాది పూజా కార్యక్రమాలు ఎంతో మహిమాన్వితమైనదని, ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

రాష్ట్ర పర్యాటక రంగానికి పెట్టుబడుల వెల్లువ

- -రూ.1,217 కోట్ల విలువైన 8 పర్యాటక ప్రాజెక్టుల ఎంవోయూలపై సంతకం చేసిన మంత్రి కందుల దుర్గేష్
- -రాష్ట్రంలోని విశాఖపట్టణం, తిరుపతి, అమరావతి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 825 రూమ్ లు ఏర్పాటుకు ముందుకొచ్చిన ఇన్వెస్టర్లు .. తద్వారా టూరిజం రంగంలో 2,567 ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించిన మంత్రి దుర్గేష్
- -ఉత్తరాంధ్ర ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన ధ్యేయంగా కొనసాగిన విశాఖ ప్రాంతీయ పర్యాటక సదస్సు
- - త్వరలోనే విశాఖ కేంద్రంగా క్రూయిజ్ హబ్ ఏర్పాటు చేస్తామని వెల్లడించిన మంత్రి దుర్గేష్.. ఎంటర్ టైన్ మెంట్, టూరిజంకు రియల్ హబ్‌గా విశాఖపట్టణం మారుతుందన్న మంత్రి
- - పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయం అని తెలిపిన మంత్రి దుర్గేష్
- -పర్యాటక అభివృద్ధిలో మంత్రి కందుల దుర్గేష్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడిన పర్యాటక సెక్రటరీ అజయ్ జైన్
- -పర్యాటక శాఖ, కార్పొరేషన్ కు మంత్రి దుర్గేష్ అద్భుతమైన సహకారం అందిస్తున్నారని వెల్లడించిన ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ
- -అరకు చలి ఫెస్టివల్ బ్రోచర్ విడుదల చేసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో : విశాఖపట్టణంలో జరిగిన రీజినల్ ఇన్వెస్టర్స్ టూరిజం సమ్మిట్‌వేదికగా రూ.1,217 కోట్ల విలువైన 8పర్యాటక ప్రాజెక్టుల ఎంవోయూలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందులదుర్గేష్ సంతకాలు చేశారు. సోమవారం విశాఖపట్టణంలో బీచ్ రోడ్‌లోని నోవాటెల్‌లో జరిగిన రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు 150కి పైగా ఇన్వెస్టర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని విశాఖపట్టణం, తిరుపతి,అమరావతి,అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో 825 రూమ్‌లు ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారు.తద్వారా టూరిజంరంగంలో 2,567 ఉద్యోగాలు కల్పించేం దుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ఐదేళ్లలో రాష్ట్రంలో 50,000 రూమ్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా నేడు కుదుర్చుకున్న విలువైన 6 ఎంవోయూలను తొలిమెట్టుగా భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన ధ్యేయంగా కొనసాగిన విశాఖ ప్రాంతీయ పర్యాటక సదస్సు విజయవంతం కావడంపై మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎంవోయూ చేసుకున్న 8పర్యాటక ప్రాజెక్టులు కీలకమైనవిగా తెలిపారు.ప్రధానంగా అట్మోస్ఫియర్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ వాళ్లు 500 రూమ్‌లను విశాఖపట్టణం, తిరుపతి, అమరావతిలో కట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. సునీయశ్రీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు వైజాగ్ లో 75 రూమ్ లు కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. డాల్ఫిన్ ఓషియన్ క్రూయిస్ వాళ్లు వైజాగ్‌పోర్టులో లగ్జరీ క్రూయిజ్‌కట్టేందుకుసిద్ధంగా ఉన్నారన్నారు. రిప్పిల్స్ అండ్ కంపెనీ వాళ్లు అల్లూరి సీతారామరాజు జిల్లాలో మైస్ సెంటర్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరెస్ట్ ఎంటర్ ప్రైజెస్, బ్లూబే ఇన్ ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించిన వాళ్లు 100 రూమ్ లతో వైజాగ్ లో లగ్జరీ రిసార్ట్ లను కట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. రాయల్ ఫామ్స్ బీచ్ రిసార్ట్స్, హొటల్ ఎస్ పార్క్ వాళ్లు బాపట్ల జిల్లాలో 100 రూమ్ లను నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు.

-కొత్త టూరిజం పాలసీ ద్వారా జీఎస్టీ, పవర్, మున్సిపల్ కార్పొరేషన్ ఛార్జీల విషయంలో పరిశ్రమ రంగానికిచ్చే రాయితీలు పర్యాటక రంగానికి ఇచ్చేందుకు తాము సిద్ధం: మంత్రి దుర్గేష్

గతంలో టీడీపీ హయాంలో మాదిరిగా రాత్రి వేళ్లలో కొంత సమయం వరకు హోటళ్లను నడిపేందుకు అవకాశం కల్పించాలని హోటల్ అసోసియేషన్ వాళ్లు కోరారని మంత్రి గుర్తుచేశారు. దాన్ని కూడా తప్పనిసరిగా అమలుచేస్తామన్నారు. కొత్త పాలసీ ద్వారా జీఎస్టీ, పవర్ ఛార్జీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఛార్జీల విషయంలో పరిశ్రమ రంగానికిచ్చే రాయితీలు పర్యాటక రంగానికి ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇన్వెస్టర్లకు ఉన్న అడ్డంకులు అధిగమించి సహకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్పష్టమైన ప్రతిపాదనలతోప్రాజెక్టులనుతీసుకురావాలని,ఆచరణసాధ్యం అనుకుంటే తక్షణమే అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. వేగవంతంగా పనిచేసే అధికారులు పర్యాటక శాఖలో ఉన్నారని, సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేస్తామని, ఆచరణ సాధ్యం కాకుంటే వెంటనే చెప్పేస్తామన్నారు. దరఖాస్తులు సమర్పించిన నెలరోజుల్లోనే సాధ్యాసాధ్యాలను పూర్తిగా పరిశీలించి ఎస్ ఆర్ నో చెప్పేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.స్టార్ హొటళ్లలో రూ. 66 లక్షలు గా ఉన్న లిక్కర్ బార్ లైసెన్స్ ను కట్టడం భారంగా ఉందని, అది లాభసాటిగా నడవడం లేదని దాన్ని రూ.20 లక్షలకు తగ్గించాలని కోరామన్నారు.ఈఅంశంపైముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నారని వెల్లడించారు.

-అద్భుత ప్రకృతి రమణీయతకు చిరునామ ఉత్తరాంధ్ర ప్రాంతం : మంత్రి కందుల దుర్గేష్

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత ప్రకృతి రమణీయతకు చిరునామ ఉత్తరాంధ్ర ప్రాంతం అన్నారు. ఇక్కడ పర్యాటక ప్రాజెక్టులు తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత వృద్ధి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి సంబంధించిన పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను, వనరులను ఆయా జిల్లాల కలెక్టర్లకు చక్కగా వర్ణించారని మంత్రి దుర్గేష్ అన్నారు. నేటి సమ్మిట్ తో రాష్ట్ర పర్యాటక రంగానికి మహర్దశ పట్టుకుందని తెలిపారు. పర్యావరణ హిత అంశాలతో నవనవోన్మేషసుందర వదనారవిందగా ఉత్తరాంధ్ర ప్రాంతం విరాజిల్లుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు. అందమైన ప్రకృతి సౌందర్యం ఒకవైపు, అద్భుతమైన అటవీ సంపద మరోవైపు, సుదీర్ఘ విశాల తీరం ఇంకోపక్కన ఉంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దృశ్యకావ్యంగా ఉందన్నారు.ఈక్రమంలో విశాఖలో ప్రాంతీయ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గడిచిన ఐదేళ్లలో గతితప్పిన పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇన్వెస్టర్లు తమ తమ పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని సుసంపన్నం చేస్తారని భావిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తే పర్యాటకాభివృద్ధి జరుగుతుందన్నారు. విజయవాడలో నిర్వహించిన సదస్సుకు అనేక మంది ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారని, వాటిని అమలు చేసే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు.పర్యాటక రంగ వృద్ధి కోసం ఇన్వెస్టర్లు తమదైన శైలిలో ఆలోచనలు పంచుకోవాలని కోరారు. వినోదంతో కూడిన పర్యాటకం ఉల్లాసాన్నిస్తుందన్నారు.

పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పనఅనేది పర్యాటకాభివృద్ధికి నాందిగా, మార్పుకు తొలిమెట్టుగా భావిస్తున్నాం:

మంత్రి దుర్గేష్పర్యాటక రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలన్న దశాబ్దాల కోరికను పర్యాటకంపై మక్కువ ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, పర్యాటకంతో పాటు పర్యావరణం బాగుండాలని కోరుకునే ఉప ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి నెరవేర్చారని అది పర్యాటకాభివృద్ధికి నాందిగా, మార్పుకు తొలిమెట్టుగా భావించాల న్నారు. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి ఇస్తున్నా మన్నారు. ఇటీవలే నూతన పర్యాటక పాలసీ 2025-29 తీసుకువ చ్చామని గుర్తుచేస్తూ ఈ సందర్భంగా శాఖాధికారులను అభినం దించారు. పాలసీ అమలు ద్వారా పర్యాటకుడు నాలుగైదు రోజులు పర్యాటక ప్రాంతంలో ఉండే విధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నా మన్నారు. తద్వారా పర్యాటకుడికి ఆహ్లాదం, మధురానుభూతితో పాటు ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి పర్యాటక కేంద్రాన్ని రెండు మూడు రోజులు పర్యాటకుడు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ బిందు మాదవ్

కాకినాడ,మేజర్‌న్యూస్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందు మాదవ్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమమునకు 75 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.జె.వి.భాస్కరరావు పాల్గొన్నారు.

రోడ్డు లేని గ్రామాల ఇబ్బందులు పట్టించుకోరా?

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏఎస్ఆర్ జిల్లా పాడేరు డివిజన్ పరిధిలోని జికె వీధి మండలం గుమ్మిరేకుల పంచాయతీలోని అన్న వరం మెట్టవీధి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక అక్కడి ఆదివాసీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు రంపచోడవరంలో ఐటీడీఏ పీవో దృష్టికి తెచ్చారు. ఆ గిరిజన గ్రామంలో ఆదివాసులు చందాలు వేసుకుని రోడ్డు నిర్మించుకుంటున్న దృశ్యం ఒక వీడియోలో చూశామని, ఎన్నో సంవత్సరాలుగా అధికారులకు దరఖాస్తులు ఇచ్చినట్లుగా అందులో తెలిపారని, ఎటువంటి స్పందన లేకపోవడంతో గ్రామస్తులే చందాలు వేసుకుని రోడ్డు నిర్మించుకుంటున్నట్లు అందులో తెలిపారన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి కావలసిన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించి, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులను నియమించారని, అయితే కొంతమంది అధికారులు ప్రజా సమస్యలు గాలికొదిలేసి, ప్రజాప్రతినిధుల చెప్పుచేతల్లో కీలుబొమ్మలు అవుతున్నారని, ఇలాంటి అధికారులకు సిగ్గుండాలన్నారు. అలాగే ఓట్లు కోసం కొందరు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోకి వచ్చి ఎన్నో వాగ్దానాలు చేస్తున్నారని, తీరా గెలిచాక ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ప్రజలు ఓటు వేసి గెలిపించింది కుర్చీల్లో కూర్చోవటానికి కాదని, గిరిజనులకు, తమ ప్రాంతాలకు అభివృద్ధి చేయాలని ఓటు వేశారని మర్చిపోవద్దన్నారు. అధికారులకు ఉద్యోగం, ప్రజాప్రతినిధులకు పదవులు ఇచ్చేది ప్రజలపై పెత్తనం చేయటానికి కాదని, సేవ చేయటానికేనని, అందుకే జీతాలు ఇస్తున్నారని, ప్రజలే లేకపోతే మీకు ఉద్యోగాలు, పదవులు ఉండవని గ్రహించి, కాగితాలలో అభివృద్ధి కాకుండా, వాస్తవంగా అభివృద్ధి చేయాలన్నారు. అన్నవరం మెట్టవీధి గ్రామానికి రోడ్డు సౌకర్యం తక్షణమే కల్పించి, ఆ గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేస్తున్నామన్నారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న బిందు మాధవ్ ఐపీఎస్ సోమవారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న ఎస్పీ బిందు మాధవ్‌కు ఆలయ ఈవో బల్ల నీలకంఠం స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామిని, బాలా త్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నంది మండలం వద్ద వేద స్వస్తి పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బిందుమాధవ్ కర్నూల్ నుండి కాకినాడకు ఎస్పీకే బదిలీపై వచ్చారు. పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పాల్గొన్నారు.

ఎపి జిఐఎల్ కౌన్సిల్ సమావేశానికి ఆహ్వానం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఫిబ్రవరి 2వ తేదిన కాకినాడ అంబేద్కర్ భవన్ నందు ఎపి జిఐఎల్ తృతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎపి జిఐఎల్ పెద్దాపురం నియోజకవర్గ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయా శాఖలలో ఉన్నతాధి కారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేకంగా కమిటి ఆహ్వానించింది. పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీని, ఆర్ & బి డిఇ రాఘవరావులతో పాటు పలువురు ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిసి ఈ సమావేశాలలో పాల్గొనవలసినదిగా ఆహ్వానించడం జరిగింది.

చేపల మార్కెట్ సమస్యలు పరిష్కారం చేయాలి

- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల మత్స్య కార్మికుల సంఘం

కాకినాడ, మేజర్ న్యూస్ : చేపల మార్కెట్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల మత్స్య కార్మికుల సంఘం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌ని కలిసి కాకినాడ రాజాజీ వీధిలో పెద్ద మార్కె టు చేపల మార్కెట్‌లో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇవ్వడం తెలియజేయడం జరిగింది. అల్యూమిని యం షాపుల వలన మార్కెట్ కనబడటం లేదు, అటువైపు ఇటువైపు అల్యూమినియం షాపులు ఉండేలాగా మధ్యలో మార్కెట్ బోర్డుతో మార్కెట్ కనబడే లాగా ,కొనుగోలుదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలాగా, అట్లాగే మహిళలకు మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలని మార్కెట్ చుట్టూ రక్షణగా ఉండే విధంగా ఇనుప మెష్ ఏర్పాటు చేయాలని, అమ్ముడుపోగా మిగిలిన సరుకును ఐస్‌బాక్స్‌లో ఉంచుతాము దానిని రాత్రులు సరుకుని దొంగలిస్తున్నారని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. కమిషనర్‌కి అర్జీలో ఈ విషయంలన్నీ రాతపూర్వకంగా ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో సంఘం నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, పి.దుర్గా దేవి, సిహెచ్ రమణి, హరమ్మ, టి.దుర్గాదేవి, సత్యవతి, నూకాలమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామి గుడి వద్ద మహాన్నదానం

- పాల్గొన్న భక్తులు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో శ్రీ బసవేశ్వర స్వామి సంబర మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం బసవేశ్వర స్వామి గుడి వద్ద మహాన్నదాన కార్యక్రమం కరికాలభక్తుల యువజన సేవా సంఘం & యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు జల్దాని సుబ్రహ్మణ్యం(బాబీ), గాడి సత్యనారాయణ, గాడి బాబూరావు, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరెడ్కో కాకినాడ చాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం

కాకినాడ, మేజర్ న్యూస్ : మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ & అర్బన్ ఎఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి పర్యవేక్షణలో నిర్వహించబడుతున్న సంస్థ నరెడ్కో అని నరెడో రాష్ట్ర ప్రెసిడెంట్ జి.చక్రధర్ పేర్కొన్నారు. కాకినాడ జి.ఆర్.టి హొటల్స్ గ్రాండ్ కాకినాడ కాన్ఫిరెన్స్ హాల్లో నరెడ్కో కాకినాడ చాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి నరెడ్కో కాకినాడ చాప్టర్ సెక్రటరీ కాటంరెడ్డి ఉపేష్ స్వాగతం పలికారు. కాకినాడ చాప్టర్ ప్రెసిడెంట్ పేర్ల వెంకట వేణుగోపాలరావు అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరెడ్కో స్టేట్ ప్రెసిడెంట్ జి.చక్రధర్ ముఖ్యఅతిథిగాను జనరల్ సెక్రటరీ సీతారామయ్య, విశిష్ట అతిథిగాను ట్రెజరర్ రమేష్, నార్త్ జోన్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ సందీప్, ఇంజనీర్ డా. బాదం సుందరరావు, ఆర్కిటెక్ట్ రాజశేఖర్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేయగా వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా నరెడ్కో స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్ మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా నరెడ్కో శాఖలు దేశం నలుమూలల వ్యాప్తి చెంది, ప్రభుత్వం విడుదల చేసిన బిల్డింగ్ మరియు లేఔట్ అనుమతులలో వస్తున్న సమస్యలపట్ల పోరాటాలు చేసి వాటి పరిష్కారానికి జి.ఒ.ల రీపొందనలో కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో పాల్గొన డా.బాదం సుందరావు, ఆర్కిటెక్ట్ రాజశేఖర్, యునియన్ బ్యాంక్ మరియు స్టేట్ మ్యాంక్ ఎజిఎం, ఆర్ఎఎస్ఎంఇసిసి తదితరులు కాకినాడ చాప్టర్ కార్యావర్గానికి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా కాకినాడ చాప్టర్ ప్రెసిడెంట్ పేర్ల వెంకట వేణుగోపాలరావు, సెక్రటరీ కాటంరెడ్డి ఉపేష్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దండెం రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వీరంరెడ్డి వెంకట రమణమూర్తి, జాయింట్ సెక్రటరీ పెన్మెత్స పృధ్వీరాజ్, ట్రెజరర్ విత్తనాల నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు యాళ్ల వెంకటేశ్వరరావుతో స్టేట్ ప్రెసిడెంట్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు చక్రధర్, సీతారామయ్య, రమేష్, సందీప్, రమేష్ బాబు, సుందరావు, రాజశేఖర్ ను నరెడ్కో కాకినాడ చాప్టరర్ ప్రెసిడెంట్ పేర్ల వెంకట వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ పేర్ల వెంకట వేణుగోపాలరావు మాట్లాడుతూ కాకినాడ రియల్ ఎస్టేట్ రంగములో తమ చాప్టర్ ద్వారా నమోదుకాబడిన బిల్డర్స్ మరియు డవలపర్స్ చేయబోయే వెంచర్స్ ద్వారా నరెడ్కోకు మంచి పేరు తీసుకువచ్చే విదంగా కృషి చేస్తామన్నారు. సెక్రటరీ కాటంరెడ్డి ఉపేష్ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

ఏజెన్సీలో గిరిజనులకు అత్యుత్తమ సేవలు

- ఉత్తమ అధికారికి గణతంత్ర పురస్కారం

రంపచోడవరం, మేజర్ న్యూస్ : మారేడుమిల్లి ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాధ్ ఉత్తమ అధికారిగా గణతంత్ర పురష్కారం అందుకున్నారు. రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ ప్రాంతంలో గిరిజనులకు అత్యుత్తమ సేవలు అందించిన అధికారిగా మారేడుమిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. మారేడుమిల్లి ఎంపీడీఓగా భాద్యతలు చేపట్టిన నాటి నుండి గిరిజనుల శ్రేయస్సు కోసం శ్రీనివాస విశ్వనాధ్ శ్రమిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఏజెన్సీ ప్రాంతంలో సమర్ధవంతంగా అమలు చేసి ఎంపీడీఓ గుర్తింపు పొందారు. ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక గిరిజనుల స్వయం పాలనకు పెద్దపీఠం వేయాలనే ప్రభుత్వ లక్షానికి అనుగుణంగా మారేడుమిల్లి మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో పీసా గ్రామసభలు సమర్ధవంతంగా నిర్వహించి ఉన్నత అధికారులు నుండి ప్రశంసలు అందుకున్నారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఉపాధి గ్రామీణ హామీ పథకం పనులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు శాఖాపరమైన ప్రగతి కనపర్చడంలో శ్రద్ధ చూపించి మారేడుమిల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో ఉంచడానికి కృషి చేసారు. సామాజిక భద్రతా పింఛన్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచడానికి కృషి చేసారు. గ్రామాలలో త్రాగునీటి సమస్యలు పరిష్కరించి, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనపర్చి ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులను, సిబ్బందిని సమన్వాయ పరుచుకొని విధి నిర్వహణలో నిబద్ధతగా ఉంటూ మండల ప్రగతికి పాటు పడినట్లు గుర్తించిన ఉన్నత అధికారులు ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాధ్ ను 76వ గణతంత్ర దినోత్సవ పురష్కారానికి ఉత్తమ అధికారిగా ఎంపిక చేసారు. ఈ సందర్భంగా రంపచోడవరం జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో రంపచోడవరం ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, శ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ కార్యాల య ఏఓ మైధిలి, మున్సిపల్ సిబ్బంది దవులూరి రాజారావు, హౌసింగ్ ఏఇ రవిశంకర్, హెచ్‌డబ్లూఓ శ్రీవల్లి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

– నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ.. కాకినాడ నగరపాలక కమిషనర్ భావన సోమవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తోన్న ఫిర్యాదులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. దీనిలో భాగంగా నగరంలోని బాలాజీ చెరువు సెంటర్లో డంపర్ బిన్లను పరిశీలించారు. అలాగే ఏడో సర్కిల్ జగన్నాధపురం లోని అన్నమఘాటీ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

క్రీడలు, సంస్కృతిక సమ్మేళన కార్యక్రమాలు

– అలరించిన ఆట పాటలు..ఆకట్టుకున్న చిన్నారుల విచిత్ర వేషధారణ
– క్రీడల్లో ప్రతిభావంతులకు భారీ నగదు బహుమానం

చింతూరు,మేజర్‌న్యూస్ : తెలుగువారి ప్రియమైన పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ సారధ్యంలో 40 రోజుల పాటు జరిగిన అంతర్రాష్ట్ర క్రికెట్, వాలీబాల్ పోటీలు ఆర్చరీ, ఫుట్బాల్, ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగింది. క్రీడల్లో విజేతలైన వారికి గణతంత్ర దినోత్సవ సందర్భంగా క్రీడాకారులకు కళాకారులకు ప్రోత్సాహకాలను అందజేయడం జరిగింది. జమాల్ ఖాన్ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో కళ వేదికపై పాల్పంచకు చెందిన ఎస్కే హుస్సేన్ చింతూరు చల్లని పల్లె తల్లి అని పాటను ఆలపించారు. ములుగు జిల్లాకు చెందిన మార్తా రవి పలు చలనచిత్రాల్లోను ఈటీవీ జబర్దస్త్ అంతర్జాతీయ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖ ఇంద్రజాలికుడు అద్భుత ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మండలంలోని పలు విద్యాసంస్థలకు చెందిన బాలబాలికలు చిన్నారుల ఫ్యాషన్ షో తోపాటు స్వతంత్ర సమరయోధుల వేషధారణలు, నేటి సమాజంలో సెల్ఫోన్ వాడకంపై యువత సామాజిక స్పృహను కోల్పోవడం, సెల్ఫీలతోనే సరిపెట్టుకోవడం, విద్యార్థులు సెల్ఫోన్ వినియోగం దుష్ప్రభావ సందేశాన్ని అందజేసే విధంగా చేసిన ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మూడువేలకు పైగా ఈ కార్యక్రమానికి ప్రేక్షకులు హాజరై విజయవంతంగా కార్యక్రమం కొనసాగింది. జమాల్‌ఖాన్ ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ ఏజెన్సీ నాలుగు మండలాలలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా, ఛత్తీస్గఢ్ లో కూడా ట్రస్ట్ ద్వారా అనేకమంది వరద బాధితులకు, అగ్ని బాధితులకు, వికలాంగులకు, అనాధలకు ట్రస్ట్ ద్వారా లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. 2022 నుండి 23 సంవత్సరకాలంలో 31, 40,000 బాధితులకు వస్తు నగదు రూపేనా సహాయం అందజేయడం జరిగిందన్నారు. 2023 నుండి 2020 నాలుగు వరకు సంవత్సర కాలంలో 44 లక్షల 30 వేల రూపాయల ఖర్చుతో వివిధ గ్రామాల్లో బోర్లు వేసి నీటి ఎద్దడిని తీర్చడం జరిగింది. వరద బాధితులకు ఇల్లు కోల్పోయిన వారికి ఇంటి నిర్మాణ సామాగ్రి, నిత్యవసర వస్తువులు బట్టలు వంట పాత్రలతో సహా నగదు పైకాన్ని కూడా అందజేయడం జరిగింది. అర్ధ శతాబ్దపు అంధకారాన్ని బ్రిడ్జిపై విద్యుత్ లైట్లను 70 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసి వెలుగులు నింపారని కొనియాడారు. నిర్ణయ సంఘం నడుపుతున్న వృద్ధ అనాధ ఆశ్రమ నిర్మాణానికి 1,50,000 విలువ చేసే పై కప్పును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో త్రాగునీరు సమస్య తెలిపిన అధికారుల మాట ప్రకారం 65 వేల రూపాయల వ్యయంతో మంచినీటి బోరు ఏర్పాటు. మారుమూల గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించడం, వీధిలైట్లు సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారని ఇంకా నాలుగు మండలాల్లో ఇంటి యజమానులు అకాలమరణం చెందిన బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా 5000 రూపాయలను అందజేయటం, ప్రమాదంలో కాళ్లు కోల్పోయినవారికి సొంత ఖర్చులతో జైపూర్ కాళ్ళను ఏర్పాటు చేశారు. ఇలా అనేక సహాయ కార్యక్రమాలపై జమాల్ ఖాన్ ట్రస్ట్‌ను వారి సేవలను కొనియాడారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా పలువురికి విలువైన వస్తువులు వేదికపై అందజేశారు. అనంతరం గోల్డ్ మెడల్ గ్రహీత మధు చందన, వెయిట్ లిఫ్టర్‌కు గంగాధర్‌కు స్థానిక యువత జెకె సిటీ సన్మానం నిర్వహించారు. జమాల్ ఖాన్‌ను కూడా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెకె సిటి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్, తనయుడు ఇమ్రాన్ ఖాన్, అబ్రార్ ఖాన్, అటవీశాఖ అధికారి తిమ్మ సాయి, సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, బిజెపి మండలాధ్యక్షులు దాసరి వెంకటరమణ, వైస్ ఎంపీపీ సుధాకర్ చిన్ని, టిడిపి నాయకులు పి.సాల్మన్ రాజు, ముత్యాల శ్రీరామ్, పొదిలి రామారావు, నరసింహారావు, సురేష్ చౌదరి, జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, కూనవరం మండలాధ్యక్షుడు చందు, రసూల్, విఆర్ పురం మండల మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్.కె.రియాజ్, జీవన్ కుమార్, ఎస్కే షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో ఎలక్ట్రికల్ డే

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో సోమవారం ఎలక్ట్రికల్ డే ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఎల్ఓ రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కల రాజ్‌కుమార్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్ అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ధామస్ అల్వా ఎడిషన్ బల్బును కనిపెట్టడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ నాళం శ్రీనివాస్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షులు తాడిశెట్టి గంగను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, నీలం శ్రీను, కరణం అప్పారావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు జవాబుదారీతనంలో అధికారులు పరిష్కరించాలి

– కలెక్టర్ పి.ప్రశాంతి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలు జవాబుదారీతనంతో అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి "పి జి ఆర్ ఎస్ మీ కోసం"లో ప్రజల నుంచి 30 అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు అందరూ ఒకే వేదికపై ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు పరిష్కారం చెయ్యాల్సి ఉందన్నారు. ప్రజల సమస్యలు మరింత వేగవంతం చేసే ఉద్దేశ్యంతో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కార ప్రక్రియ పెండింగ్ లేకుండా అధికారులు చూడాలని స్పష్టం చేశారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన విధంగా అర్జీదారులు సంతృప్తే ధ్యేయంగా పరిష్కరిస్తూ పీజిఆర్ఎస్ నిర్వహణ తీరు పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించాలని సూచిం చారు. సమస్యల పరిష్కారం కొరకు క్షేత్ర స్థాయి అధికారులతో నిరంతర సమ న్వయం అవసరమన్నారు. అర్జీ అందిన వెంటనే క్షణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దిష్ట గడువు లోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్టీవో రాణి సుస్మిత, డిఎల్ డివో, స్లీవారెడ్డి, కొవ్వూరు డిఎస్పి జి. దేవకుమార్, కొవ్వూరు మండల ఎమ్మార్వో దుర్గాప్రసాద్, డివిజన్ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విఆర్ఓగా కలెక్టర్ అవార్డు అందుకున్న పాలపర్తి వెంకటేశ్వరరావు

పెరవలి, మేజర్ న్యూస్ : పిట్టల వేమవరం గ్రామంలో వీఆర్వోగా పనిచేస్తున్న పాలపర్తి వెంకటేశ్వరరావు 76వ గణతంత్ర దినోత్సవ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ విఆర్ఓ అవార్డును అందుకున్నారు. పిట్టల వేమవరం గ్రామంలో 1432 ఫస్ట్ లీక్ సంబంధించి ల్యాండ్ రెవెన్యూ కలెక్షన్ వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకుకానను ఈ అవార్డు లభించింది అని వీఆర్వో పాలపర్తి వెంకటేశ్వరావు మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి గణతంత్ర దినో త్సవ వేడుకలలో వీఆర్వో పాలపర్తి వెంకటేశ్వరరావు కు అవార్డును ప్రశంస పత్రాన్ని అందజేశారు. పెరవలి మండల తాసిల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్‌గా జాయిన్ అయి అంచలంచలుగా ఎదుగుతూ విఆర్ఓ గా ఎదిగి త్వరలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కాబోతున్న పాలపర్తి వెంకటేశ్వరరావు ఈ అవార్డు అందుకోవడం పట్ల పెరవలి తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పిట్టలవేమవరం గ్రామ ప్రజా ప్రతినిధులు మండలానికి సంబంధించిన అధికారులు అనధికారులు ఉత్తమ వీఆర్వో అవార్డు పొందిన పాలపర్తి వెంకటేశ్వరరావును అభినందించారు.

చర్చి వీధి ఎంపీపీ పాఠశాల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలి

ఆలమూరు, మేజర్ న్యూస్ : ఎస్సీ కాలనీ లోని చర్చి వీధి ఎంపీపీ పాఠశాలను గ్రామం మధ్యలోని పాఠశాలలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, ఎస్సీ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలలో 42 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలను విలీనం చేయబోయే పాఠశాలకు వీరు చేరుకోవాలంటే మధ్యలో రావులపాలెం – కాకినాడ ప్రధాన రహదారిని దాటాల్సి ఉంటుందని, దీనివల్ల విద్యార్థులు ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉందని వారు ఆ వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులోని కంద్రిగలో ఉన్న పాఠశాల, శెట్టిబలిజ రామాలయం సమీపంలో ఉన్న పాఠశాల అతి సమీపంలో ఉన్నాయి. ఎక్కడో దూరంగా ఉన్న ఎస్సీ కాలనీలోని పాఠశాలను ఈ విలీన ప్రక్రియలో భాగస్వామ్యం చేయడంపై ఇప్పటికే స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. శెట్టిబలిజ రామాలయం సమీపంలోని పాఠశాలలో ఎటువంటి వసతులు లేకపోవడం, నాలుగు తరగతి గదులు, కేవలం ఒక టాయిలెట్ మాత్రమే ఉండటం, ఆటస్థలం లేకపోవడం, మధ్యాహ్న భోజన వసతికి ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం వంటి అవస్థలు ఉండటంతో ఆ పాఠశాలలో ఏ పాఠశాలను విలీనం చేయరాదని స్థానికులు కోరుతున్నారు. ఈ సందర్భంలో నేడు ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఎస్సీ నాయకులు ఈ అంశంపై వినతి పత్రం సమర్పించడం విశేషం. మండల విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ఉత్తమ ప్రదర్శనగా 'స్వేచ్ఛా'

న్యాయ నిర్ణేతలుగా శాంతారావు, స్వామి, రాధాకృష్ణలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రమాంపల్లి (దివిలి) లో ఈ నెల 24, 25, 26 తేదిలలో జరిగిన 6వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన స్వేచ్ఛా నాటిక నిలిచింది. మూడు రోజుల పాటు ప్రదర్శించిన 7 నాటికలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జి.ఎస్.ఆర్.స్వామి, డి.రాధాకృష్ణలు వ్యవహరించగా, నాటిక పోటీల విజేతలను కమిటీ తరపున జి.ఎస్.ఆర్.స్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా కె.శాంతారావు మాట్లా డుతూ నాటకం ప్రజలనుండి నేర్చుకుందని, ప్రజలకు నేర్పిందని, నాటకంలో పాత్రదారులు మనతో మాట్లాడతారని, మనతో కలిసి నడుస్తారని, మనల్ని, మన జీవితాలను నాటకంలో చూపిస్తారని, మనదే ఈ జీవితం అనే విధంగా ప్రతిబింబిస్తారని తెలిపారు. కవి, కళాకారులు సమాజంలో ఒక తరం ముందే ఉంటారని, ముందు తరాలకు గత స్మృతులను అందించడం, వాటి ద్వారా భవిష్యత్‌కు పునాది వేసుకునే అవకాశాన్ని నాటకం కల్పిస్తుందన్నారు. అప్యాయత, అనురాగాల మేలు కలయిక ఈ స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అని, నాటకాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఈ సందర్భంగా శతకోటి వందనాలని తెలిపారు. నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా 'స్వేచ్ఛా' నిలువగా, ద్వితీయ ఉత్తమ నాటికగా మిత్ర క్రియేషన్స్ వారి 'ఇది రహదారి కాదు', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురుమేఘం' నిలిచిందని, ఉత్తమ నటుడుగా స్వేచ్ఛా నాటికలో ఆనంద్ పాత్రదారి డా.వెంకట్ గోకేడ, ఉత్తమ నటిగా రాత నాటికలో స్వప్నిక పాత్రదారి వాగ్దేవి, ఉత్తమ రచన మిత్ర ఆర్ట్స్ అకాడమి వారి ఇది రహదారి కాదు నాటిక రచయిత ఆకురాతి భాస్కర్‌కు, ఉత్తమ దర్శకత్వం స్వేచ్ఛా నాటికకు బి.ఎన్.రెడ్డి, ఉత్తమ రంగాలరంకరణ స్వేచ్ఛా నాటికకు ఫణి, ఉత్తమ ఆహార్యం పి.వేశవ, ఉత్తమ సంగీతం సురభీ నాగరాజుకు వచ్చాయని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా, గౌరవాధ్యక్షులు ఇంధన బ్రహ్మానందం, కొత్తెం స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగేశ్వరరావు, గొందేశి సత్యానందం, వెన్నా సత్యనారాయణ (పండు), నూకలమంతి నానాజీ, పాలాని సత్తిబాబు, కురుమెళ్ళ శ్రీనివాస్, కర్రి స్వామి, మాగాపు నాగేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మిటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

కాకినాడ,మేజర్‌న్యూస్ : జనవరి 1వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగముగా సోమవారం సాయంత్రం 4 గంటకు, కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎస్‌డిపివో, ఎఎస్పీ దేవరాజ్ మనిష్ పాటిల్ పర్యవేక్షణలో, కాకినాడ ట్రాఫిక్–1 సిఐ ఎన్.రమేష్, మరియు ట్రాఫిక్ ఎఎస్సై ఆర్.రామ్మోహన్, కాకినాడ సాంబమూర్తి నగర్ రోడ్‌లో ఉన్న ఎపి సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నందు ఇంటర్ 2వ సం॥ చదువుతున్న విద్యార్థునులకు, ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ పైన, సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి వారికి వివరించడం జరిగినది. ద్విచక్ర వాహనం నడుపు ప్రతిఒక్కరు మరియు వారి కుటంబ సభ్యులు అందరు విధిగా హెల్మెట్ ధరించి వాహనము నడపాలని ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించటమైనది. తదుపరి సైబర్ నేరలలో భాగముగా ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్, డిజిటల్ అరెస్టు, 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అఖిలపక్షంతో కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ 2025-26 సమీక్ష నిర్వహించాలి

– పౌర సంక్షేమ సంఘం

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ నగరపాలక సంస్థ కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారి ప్రభుత్వ ప్రతినిధుల సమక్షంలో అఖిలపక్షంతో సమీక్షా సమావేశం నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గత ఏడాదిజూలై (15.7.2024 ఆర్‌సి నెం. 3878/2024/సి2 పిర్యాదు నెం.కెకెడి 202407154184) లో గ్రీవెన్స్ ద్వారా కోరిన సందర్భంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజా సంఘాల అఖిలపక్షంతో సమీక్షా సమావేశం ఏర్పాటుకు అంగీకరించారని ఇదే విషయాన్ని డిసెంబర్ లో మరోసారి గ్రీవెన్స్ అర్జీ దాఖలు చేయగా సంక్రాంతి ముందు నిర్వహిస్తామని తెలిపినప్పటికీ కార్యాచరణ జరగ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యదర్శిగా వున్న ముద్దాడ రవిచంద్ర గతంలో ఇక్కడ ప్రత్యేక అధికారిగా వున్న హయాంలో కార్పోరేషన్ ప్రత్యేక అధికారిగా అఖిలపక్షం నిర్వహించి రాజకీయ పార్టీల ప్రజా సంఘాల వివిధ వర్గాల అభిప్రాయాలు సూచనలు సలహాలు స్వీకరించి ప్రగతి అజెండాతో బడ్జెట్ రూపకల్పన చేసేవారన్నారు. పాలక వర్గం లేనందున అదే రీతిగా సమావేశం నిర్వహణ చేయాలని ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో కోరడం వలన కలెక్టర్ అంగీకరించిన దృష్ట్యా సమావేశం తేదీ ప్రకటిస్తామని కార్పోరేషన్ యంత్రాంగం జవాబు ఇచ్చి 5నెలలు అయినప్పటికీ కార్యరూపం దాల్చ లేదన్నారు. మూడేళ్లుగా కార్పోరేషన్ పాలక వర్గం లేకుండా రెండేళ్లుగా ఆరుగురు కమీషనర్లు నలుగురు ప్రత్యేక అధికారులు మారినప్పటికీ పౌర సౌకర్యాల ప్రగతి కోసం ప్రజల అభిప్రాయాలు స్వీకరించే సమీక్షా సమావేశం చేపట్టలేదన్నారు. 2025–26 బడ్జెట్ సందర్భంగా అఖిల పక్ష సమీక్షా సమావేశం నిర్వహించాలని పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. జిల్లాకు చెందిన ఏకైక మంత్రి డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జిల్లాఇన్ ఛార్జ్ మున్సిపల్ మంత్రి పి నారాయణ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వర రావు రూరల్ ఎమ్మెల్యే పంతం వేంకటేశ్వర రావు ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ శాసనమండలి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మున్నగు చట్టసభల ప్రజాప్రతినిధులు వున్నప్పటికీ జిల్లా కేంద్రంలో ప్రగతి అజెండా గురించి సమీక్షా సమావేశం నిర్వహించే ఏర్పాటు పట్ల ప్రభుత్వానికి తగిన శ్రద్ధ లేకపోవడం దురదృష్టకరంగా వుందన్నారు.

కాకరపర్రు పట్టా భూములను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

– పట్టా భూమి వారసులకు కేటాయింపు అర్జీపై కలెక్టర్, జేసీ విచారణ

పెరవలి, మేజర్ న్యూస్ : కాకరపర్రు గ్రామంలో జనవరి 27వ తేదీ సోమ వారం బి పట్టా, లంక ల్యాండ్ పట్టా భూములు వారసులకు పట్టాలు పంపిణీ చేయాలని వారసులు ద్వారా ఇచ్చిన వినతి మేరకు జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడుతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కాకరపర్రు గ్రామంలో పర్యటించారు. సంబంధించిన అర్జీలో పేర్కొన్న సర్వే 60, 61 తదితర సర్వే నంబర్లలో ఉన్న భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలను తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన పట్టా భూములు వారసుల వివరాలు తో సమగ్ర నివేదికఅందచేయాలని పెరవలి మండల తాసిల్దార్, మండల సర్వే అధికారి ని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా మైన్స్ అధికారిడి ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మి నారాయణ , పెరవలి తాసిల్దార్ డి. అచ్యుత కుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పులిదిండి పావని, డిటి సన్నీ బాబు మండల సర్వేయర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీరింగ్ అసిస్టెంట్గా కలెక్టర్ ప్రశంస పత్రం పొందిన సూరిబాబు

పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు 1 సచివాల యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా పని చేయుచున్న ఎస్ సూరిబాబు రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదగా ఉత్తమ ఇంజనీరింగ్ అసిస్టెంట్గా అవార్డు పొందారు. కానూరు గ్రామ సచివాలయం–1 ఇంజనీరింగ్గా అసిస్టెంట గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సూరిబాబుకు అవార్డు రావడంతో జనవరి 27వ తేదీ సోమవారం కానూరుపంచాయితీ సర్పంచ్ భావన మధు పూర్ణ చందు మరియు వార్డ్ మెంబెర్ బూరుగుపల్లిరాజు సూరిబాబుని సత్కరించారు. సూరిబాబుని ఆదర్శముగా తీసుకొని తోట ఉద్యోగులు పనిచేయాలని సర్పంచ్ మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రాంబాబు ఉప సర్పంచ్ నరసింహమూర్తి ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు త్రాగునీరు, డ్రైనేజీ, వీధి లైట్లు పూర్తిస్థాయిలో అందించడంపై అధికారులు దృష్టి పెట్టాలి

– ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు త్రాగునీరు, డ్రైనేజీ, వీధి లైట్లు పూర్తిస్థాయిలో అందించడంపై దృష్టి పెట్టాలి అని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ బడ్జెట్ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.దోమలను నిర్మూలించడంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు నిబద్ధతతో పనిచేయాల న్నారు, ప్రజలకు త్రాగునీరు అందించడంలో మరియు వీధి దీపాలను వెలిగించడంలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భాజపా జెండా ఏర్పాటుకు శ్రీకారం

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఏలేశ్వరం రూరల్ మండలం రమణయ్యపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల రూరల్ అధ్యక్షుడు నీలి సురేష్ ఆధ్వర్యంలో జెండా దిమ్మ నిర్మాణం చేయడం జరిగింది. యువ మోర్చా అధ్యక్షుడు గరికి నాగు నిర్మాణం చేయగా ఈ యొక్క కార్యక్రమంలో రూరల్ మండల పూర్వ అధ్యక్షుడు కూరాకుల రాజా మాట్లాడుతూ ఈ గ్రామ జండాదిమ్మతో కలిపి రూరల్ మండలం మొత్తం జెండా దిమ్మల నిర్మాణం చేయడం జరిగింది. అని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ నాకు అప్పజెప్పిన బాధ్యత పూర్తి చేశానని, నేడు భారత దేశానికి చేస్తున్న సేవకుగాను రాజా మాట్లాడుతూ పార్టీకి నేను రుణపడి ఉంటానని రాజా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఇరు మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

– ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి

రంపచోడవరం,మేజర్న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన విజయ వంతం అయ్యిందని, వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే శిరీష దేవి విలేకరులతో మాట్లాడుతూ జగన్ రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం తండ్రి కొడుకులు రేయింబవళ్ళు కష్టపడుతున్నారని అన్నారు. నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి, తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని, నేడు మరో ఇన్నోవేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టి, ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులు వారి రాష్ట్ర శ్రేయస్సుకై పోటీ పడినా, చంద్రబాబు మాత్రం రాష్ట్రం కోసమే కాకుండా యావత్ భారత దేశం తరపున దావోస్ పర్యటనకు నాయకత్వం వహించారన్నారు. ప్రపంచంలోనే అత్యంత తలసరి ఆదాయం గల దేశాల్లో మన దేశాన్ని అగ్రగామిగా నిలపాలని పిలుపునివ్వడంతో పాటు తెలుగువాడి ప్రతిభను మరోసారి పరిచయం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఎమ్మెల్యే శిరీష దేవి పేర్కొన్నారు.

20లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా ఎముకలు కొరికే చలిన సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. వెళ్ళిన ప్రతీ చోట రెడ్ కార్పెట్ వేసి చంద్రబాబు, లోకేష్ బాబుకు పారిశ్రామికవేత్తలు స్వాగతం పలికారన్నారు. రాష్ట్రంలో ఉన్న అపార వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని ఆహ్వానించారన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు విజన్ ను మెచ్చుకోవడం, రాష్ట్రంలో పెట్టుబడి పెడతామని హామీ ఇవ్వడం చూస్తుంటే చంద్రబాబు విజన్ 2047 విజయాన్ని సూచిస్తోందన్నారు. దావోస్ లో పర్యటించిన నాలుగు రోజుల్లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కలిసిన ఎంతోమంది పారిశ్రామికవేత్తలను జగన్ రెడ్డి జీవితంలో కలిసి ఉండరన్నారు. దావోస్ లో చంద్రబాబు కానీ లోకేష్ బాబు కానీ కలిసిన పారిశ్రామికవేత్తల పేర్లు సైతం జగన్ రెడ్డి, అతని ముఠాకు పలకడం రాదన్నారు. చంద్రబాబు విజన్ కు మెచ్చి, అమలు చేస్తున్న పాలసీలకు ఆకర్షితులై అనేక దేశ విదేశి కంపెనీలు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు నేడు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నారని ఎమ్మెల్యే శిరీష దేవి వ్యాఖ్యానించారు. ఐదేళ్లల్లో జగన్ రెడ్డి తీసుకురాలేనన్ని పెట్టుబడులు ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే మనం సాధించామని, చంద్రబాబు పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలు స్థాపించేందుకు ఆంధ్రప్రదేశ్ స్వర్గదామిగా మారిందన్నారు. చంద్రబాబు కృషితో రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు, స్టార్టప్ కంపెనీలను, లక్షల కోట్ల పెట్టుబడులను కమిషన్ లు కోసం కక్కుర్తి పడి జగన్ రెడ్డి తరిమేశాడని, జే ట్యాక్స్ పారిశ్రామికవేత్తలను బెంబేలెత్తించి పారిశ్రామికాభివృద్ధిని గాలికి వదిలేశాడని దుయ్యబట్టారు. కేసులు నుంచి విముక్తి పొందేందుకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకు, విశాఖ ఉక్కును అమ్మేందుకు జగన్ రెడ్డి ప్రయత్నించినా, గాడి తప్పిన అన్ని రంగాలను చంద్రబాబు తిరిగి గాడిలో పెట్టారని అన్నారు.

2014లో విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడేందుకు విశాఖలో 3 సార్లు పెట్టుబడుల సదస్సును నిర్వహించి, దావోస్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి అన్ని రంగాల్లో కలిపి రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి బ్రాండ్ ఏపీగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. 2019లో వైసీపీ వచ్చాక 'బ్రాండ్ ఏపీ'గా ఉన్న మన రాష్ట్రాన్ని 'బిల్డప్ ఏపీ'గా జగన్ రెడ్డి మారిస్తే తిరిగి సన్ రైజ్ ఏపీగా నేడు చంద్రబాబు మార్చారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, ఇప్పటికే అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు మొదలుపెట్టాయని, యువతకు 40 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయన్నారు. ఒక్క జూమ్ కాల్‌తో ఆర్సెలార్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్ కంపెనీతో మాట్లాడి రాష్ట్రానికి 1.46 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చిన ఘనత నారా లోకేష్ బాబుదని, జనవరి 8న విశాఖలో రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని మోది శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. టీసీఎస్, బీపీసీఎల్, రిలైన్స్, గ్రీన్కో, ఆర్సెలార్ మిట్టల్ & నిప్పాన్ స్టీల్, పీపుల్ టెక్ వంటి ఎన్నో పరిశ్రమలు ఇప్పటికే మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టబోతున్నాయని ఎమ్మెల్యే శిరీష దేవి పేర్కొన్నారు.

చిట్నీడి కుటుంబాన్ని పరామర్శించిన జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి

కిర్లంపూడి, మేజర్ న్యూస్ : జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన చిట్నీడి సత్యనారాయణ ఇటీవలే స్వర్గస్తులైనారు అని తెలిసి వేలంక గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని జగ్గంపేట జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలుగుబంటి శివ,చిట్నీడి సురేంధ్ర, కటికాల నవీన్,ఇంటి పవన్, ఏరికిరెడ్డి వాసు ఇతరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని ఆదుకోవాలి హంతకులను కఠినంగా శిక్షించాలి

– పెరవలి ఎంపీడీవోకు వినతిపత్రం అందించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

పెరవలి, మేజర్ న్యూస్ : కర్నూలు జిల్లా ఆలూరు మండలం, ఆరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పరశు ఈరన్న ను దారుణంగా హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని ఆయన కుటుంబ సభ్యులు ఆదుకోవాలని పెరవలి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు పెరవలి ఎంపీడీవో సిహెచ్ వెంకటరమణ కు వినతిపత్రం అందించారు. ఈ వినతి పత్రాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పంపాలని వారు అభ్యర్థించారు. జనవరి 27వ తేదీ సోమవారం పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో పెరవలి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన ర్యాలీ చేసి వినతిపత్రాన్ని పెరవలి ఎంపీడీవో కి అందించారు. ఈ సందర్భంగా కాపవరం ఫీల్డ్ అసిస్టెంట్ మెర్ల రాంబాబు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నందు కర్నూలు జిల్లా ఆలూరు మండలం ఆరికర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురమ ఈరన్న గత ఆరేళ్లుగా ఉపాధి కూలీలకు సేవలు అందిస్తున్నారని జనవరి 24వ తేదీ విధులు నిర్వహించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సందర్భంగా దుండగులు వేటకొడవల్లతో దారుణంగా నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ భయాందోళన గురవుతున్నారని కావున వెంటనే స్పందించి కురుమ ఈరన్నను హత్య చేసిన దుండగులను అరెస్టు చేయించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఈరన్న కుటుంబానికి ప్రభుత్వం నుండి 30 లక్షలు రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా ఇల్లు నిర్మించి ఇప్పించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేస్తున్నాము అన్నారు. అలాగే రాష్ట్రంలోని ఫీల్డ్ అసిస్టెంట్లలో ఏర్పడిన భయాందోళన తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సహకార పరపతి సంఘంలో జరిగిన అవినీతిపై సామాజిక ప్రజావేదిక

జగ్గంపేట, మేజర్ న్యూస్ : కిర్లంపూడి సహకార పరపతి సంఘంలో జరిగిన అవినీతిపై సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ప్రజా వేదికలో అనేక నిజాలు బయటపడ్డాయి. కిర్లంపూడి సొసైటీలో జరిగిన 104,కోట్ల 18 లక్షల 10 వేల 598 రూ అవకతవకలపై పాల్పడిన వ్యక్తులపై సోమవారం నివేదకను వెల్లడించారు. అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీతోపాటు,చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పర్సనల్ ఇంచార్జ్ శ్రీరంగనాయకులు అన్నారు. చనిపోయిన వారి పేర్లతో రుణాలు తీసుకున్నట్లు భూములు లేని వారి పేరుతో రుణాలు కాజేసినట్లు సొసైటీ వద్ద నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులు వెల్లడించారు. నా తల్లి 10 ఏళ్ళ క్రితం చనిపోయిందని అమె పేరుతో 8 లక్షల రుణాన్ని తీసుకున్నారని ఓ రైతు మండిపడ్డాడు. గ్రామానికి చెందిన మేము ఉద్యోగరీత్యా వేరే చోట ఉంటున్నామని, తమ పేరుతో పొలం లేకపోయినా రుణాలు ఇచ్చారని మరొకరు ప్రశ్నించారు. రైతులు తీసుకున్న రుణాలను మాపి చెయ్యాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సిఐ వైఆర్కె విశిష్ట సేవలకు ఉత్తమ పురస్కారం

– వెల్లువెత్తిన అభినందనలు

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వైఆర్ శ్రీనివాసుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అంకితభావంతో పని చేస్తూ.. అవిశ్రాంతంగా కర్తవ్య నిర్వహణలో అటు ప్రభు త్వానికి ఇటు ప్రజలకు అభిమాన పాత్రుడైన వై ఆర్ కే శ్రీనివాస్ కు లభించిన గౌరవాన్ని ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. ఆదివారం కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ పగిలి ప్రశంసా పత్రాన్ని వై ఆర్ కేకు అందించారు. అత్యంత విలువైన గౌరవ పురస్కారాన్ని అందుకున్న వై ఆర్ కె జగ్గంపేట ప్రజలకు సుపరిచితులు. గతంలో ఎస్సైగా ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలను చైతన్య పరచడం, యువత చెడు మార్గాలు పట్టకుండా మేల్కొల్ప డం, అసాంఘిక కార్యక్రమాలకు సింహ స్వప్నంగా మారి, అక్రమార్కులకు గుండెల్లో దడ పుట్టించి, ప్రజల చేత శివమణిగా పిలిపించుకున్న వైయస్ కే. శ్రీనివాస్ జగ్గంపేట సి ఐ గా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఎస్ఐగా వై ఆర్ కె ఫోన్ నెంబర్ ప్రతి గ్రామంలో ప్రతి మహిళ చేతిలో ఉండేది.ఈ పరిణామం అక్రమార్కులకు దడగా మారింది. ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆయన రాక శుభవార్తగా చేరింది. జగ్గంపేటలో బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే తనదైన శైలిలో రోడ్డు ప్రమాదాల నివారణకు, అక్రమ వ్యాపారాల అణచివేతకు పలు అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. సర్కిల్ పరిధిలో ఎస్సైలను కలుపుకుపోతూ, సిబ్బందిని ఉత్సాహపరుస్తూ పోటీపడి ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించారు. అతని సేవలను గుర్తించిన అధికారులు రిపబ్లిక్ డే సందర్భంగా ప్రశ్నించా పత్రం అందించడం నాయకులు ప్రజలు అభినందిస్తున్నారు. మరిన్ని ప్రశంసలు అభినందనలు అవార్డులు రివార్డులు ఆయన సాధించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు.

ఘనంగా పెన్షనర్స్ వ్యవస్థాపక దినోత్సవం

ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ధవలేశ్వరం శాఖ వ్యవస్థాపక దినోత్సవం యర్రమోతు ధర్మరాజు అధ్యక్షతన సంఘ కార్యాలయ ఆవరణలో జరిగింది, ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ సంఘంలో సభ్యులు సుమారు రెండు వందల ఏభై మంది ఉన్నారని అంతా ఓ కుటుంబంగా కలిసి మెలిసి ఉంటామని వివరించారు, ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ధవలేశ్వరంలో పదవీవిరమణ చేసిన వారందరినీ సభ్యులుగా చేర్పించాలని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని అందుకు అవసరమైతే నా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు, కదలలేని విశ్రాంతి ఉద్యోగులకు ఇంటి వద్దనే పింఛన్ అందించేందుకు బ్యాంకు మేనేజర్ల తో మాట్లాడి ఏర్పాటు చేసేమన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కామేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి బండారు రవీంద్ర, విజయ మోహన్, డి.సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మహాలక్ష్మి రావు, గుమ్మెల్ల కొండల రావు, అంసూరి సూర్యారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు, గ్రామంలో విశిష్ట సేవలు అందిస్తున్న స్టేట్ బ్యాంక్ మేనేజర్ బి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి, సీనియర్ పెన్షనర్లు ప్రొఫెసర్ ఐవీ సుబ్బారావు, పి. సూర్యనారాయణ శర్మ లను పూలమాల, దుశ్శాలువా, మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు, సంఘ కార్యాలయ అతను భవన నిర్మాణానికి కామేశ్వర శర్మ, విజయ మోహన్, బండారు రవీంద్ర, ఐ వి సుబ్బారావు, ప్రసాద్ ఒక్కొక్కరు పదివేల నూట పదహారు రూపాయలు ప్రకటించారు, వారందరికీ ధవళేశ్వరం యూనిట్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతాం

– బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట సాహితీ పబ్లిక్ స్కూల్ వద్ద సోమవారం భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ దాట్ల కృష్ణ వర్మ అధ్యక్షతన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై బిజెపి అనుచిత వ్యాఖ్యలు చేసిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను ఏనాడు గౌరవించలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున తమ సత్తా చాటుతామన్నారు. రాష్ట్రంలో బిజెపి బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. అన్నిచోట్ల తమ బీజేపీ పార్టీ ప్రభావం ఉంటుందని దానిపై ఇప్పటినుంచే కష్టపడుతున్నామన్నారు. బిజెపి జగ్గంపేట నియోజకవర్గం అధ్యక్షులు దాట్ల కృష్ణ వర్మ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి ప్రజలందరికీ ఎప్పుడో అర్థమైంది అన్నారు. గ్రామ గ్రామాన రాజ్యాంగం గురించి పూర్తి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంబేద్కర్ యొక్క ఆశయాలను ప్రజలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్ పాదాలకు నమస్కరించి పవిత్రమైన భగవద్గీతగా భావించి ముందుకు తీసుకెళ్తున్నారు అన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా చాలా బలంగా ఉందని పత్రికలు మీడియాలో కాంగ్రెస్ పార్టీపై వచ్చే వార్తలను చూసి జనాలు నవ్వుకుంటున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ వారు తప్పిదాలను తెలుసుకోవాలన్నారు. దళితులకు సేవ చేసే ఏకైక పార్టీ బిజెపి పార్టీయేనని దేశం, రాష్ట్రవ్యాప్తంగా బిజెపిలోకి చేరికలు చూస్తుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ మొత్తం ఖాళీ అయిపోయే పరిస్థితి కనిపిస్తుందని కృష్ణ వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, మట్ట మంగరాజు, డివిఎస్ రాజు, వత్సవాయి వరాల బాబు, జగ్గంపేట మండల అధ్యక్షులు పల్లా రాము, గండేపల్లి మండల అధ్యక్షులు తోరాటి వెంకన్న, గోకవరం మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, కో కన్వీనర్ కోన సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగు పరచడం అంటే ఏమిటి..? గృహ నిర్మాణం పనులు ఎప్పటి లోగా పూర్తవుతాయి

– స్వచ్ఛంధ్ర మిషన్ నెల వారి కార్యాచరణ ప్రణాళిక అమలు, వాటి ఫలితాలు పై నివేదిక ఇవ్వాలి

– కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : జిల్లాలో గృహ నిర్మాణాలు నిర్దేశించిన లక్ష్యలను వేగవంతం చెయ్యాలని, ఫిబ్రవరి మొదటి వారంలో గృహ ప్రవేశాలను ప్రజా ప్రతినిధులు సమక్షంలో వేడుకగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ,పెన్షన్ పంపిణీ తరహాలోనే ఇంటింటి సర్వే నిర్వహించి గృహ ప్రవేశాలు చేపట్టాలని ఆదేశించారు.ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు చేపట్టానున్న దృష్ట్యా గృహనిర్మాణ పనులు పూర్తిచేసి,స్థానిక శాసన సభ్యులు ప్రజా ప్రతినిధుల సమక్షంలో గృహ ప్రవేశాలు నిర్వహించేలా సిద్ధంగా ఉంచాలన్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మార్చి నాటికి 3823 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఇప్పటి వరకూ 435 పూర్తి చేశారని, కొవ్వూరు, అనపర్తి,చాగల్లు, సీతానగరం మండలాల తక్కువ ప్రగతి సాధించడం పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పనితీరు ఆధారంగా జీతాలు ఇవ్వాలని హౌసింగ్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో పల్లెపండగ ద్వారా చేపట్టిన సిసి రోడ్స్ 667 పనుల లక్ష్యలకు గాను 493 పనులను పూర్తి చేయ్యడం జరిగిందన్నారు.. రోజు వారి ప్రగతి సాధించని చోట్ల తరచూ తనిఖీలు నిర్వహించి పురోగతిని సాధించాలన్నారు. పనులు ప్రారంభించే ముందు పనులు పూర్తి అయిన తరువాత పనుల వివరాలు తెలియచేయు ఫోటోలు సమర్పించాలన్నారు.మిని డైయిరీ యూనిట్ల స్థాపనకు ఆయా కార్పొరేషన్ వారి లబ్ధిదారుల ఎంపిక చేయ్యాలి. బిసి యాక్షన్ ప్లాన్ కింద 3 పట్టణ, 19 మండలాలకు గాను జిల్లాలో 1879 యూనిట్స్ సంబంధించి రు. 52.46 కోట్లు గాను 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు లు ద్వారా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. సాక్షం పథకం కింద అంగన్వాడీ కేంద్రాల్లో 78 డ్రింకింగ్ యూనిట్స్ కి సంబంధించి 75 పూర్తి చేసినట్లు, టాయిలెట్స్ లో 173 కి 166 , పోషణ వాటికాలు 704 కి వంద శాతం పూర్తి చేసినట్లు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను జేసీ చిన్న రాముడు అభినందించారు. హార్వెస్టింగ్ కి చెంది 304 పనులకు గాను 159 మాత్రమే పూర్తి చేసినట్లు, మిగిలిన లక్ష్యాలను జనవరి నెలాఖరులో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి నాటికి పనులు పూర్తి చేసి చెల్లింపులు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. 205 చోట్ల పనులు ప్రారంభం కాని పనులు క్షేత్ర స్థాయిలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని సూచించారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ అందించే డేటా ప్రకారం పిల్లల ఆధార్ ఎన్రోల్మెంట్ 100 శాతం జరగాలి, ఆర్డీవో లు, ఎంపీడీవో లు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్రోల్మెంట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ . చిన్న రాముడు, డి ఆర్వో టీ. సీతారామ మూర్తి , డి ఆర్ డి ఎ – పి డి ఎస్ వి వి ఎస్ మూర్తి , జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కే. విజయ కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలకు అవార్డులు

– డా.చల్లా వెంకట నరసింహారావు, డా.మానుకొండ శ్రీనివాసులకు అవార్డులు

పెరవలి, మేజర్ న్యూస్ : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాయం కు చెందిన, దివాన్ చెరువు లోని తూర్పు గోదావరి జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలైన డా. చల్లా వెంకట నరసింహరావు, కోఆర్డినేటర్ మరియు డా. మానుకొండ శ్రీనివాస్ లకు జిల్లాస్థాయిలో ఉత్తమ శాస్త్రవేత్తలుగా అవార్డులు రావడం పట్ల పెరవలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, జిల్లాలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. 76 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో శాస్త్రవేత్తల కేటగిరిలో ఎంపిక కాబడిన వారికి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి ఉత్తమ శాస్త్రవేత్తలు గా అవార్డులు ప్రధానం చేశారు.

ఈ సందర్భంగా డా.నరసింహరావు మాట్లాడుతూ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు జిల్లాలోని రైతులకు సకాలంలో మినికిట్స్, విత్తనాల పంపిణి, శిక్షణ, వ్యవసాయ సలహాలు వంటి కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని, నూతన సాంకేతిక పోకడలతో జిల్లా రైతాంగంనకు ఎప్పటికప్పుడు వ్యవసాయ సలహాలు ఇస్తూ, రైతుల సర్వతోముఖాభివృదికి పాటుపడుతున్నారని తెలిపారు.డా. చల్లా వెంకట నరసింహ రావు కోఆర్డినేటర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 26 సంవత్సరాల నుండి వివిధ స్థాయిలలో పరిశోధకుడిగా 16 సంవత్సరాలు, వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్‌గా 7సంవత్సరాలు, విస్తరణ శాస్త్రవేత్తగా 3 సంవత్

వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం గణపవరం మండలం అర్దవరంకు చెందిన అడ్డాడా వెంకటనాగరాజు, సురేఖ దంపతులు రూ.1,11,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆల య మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న సీఐ పెద్దిరాజు

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : ఉత్తమ సేవా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ షణ్ముహన్ సాగిలి చేతుల మీదగా కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్ స్టేషన్ సీఐ పెద్దిరాజు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ పోలీస్ ప్రేరేడ్ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవా పురస్కారం పత్రాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్ము హన్ సాగిలి అందజేయడం జరిగింది. కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడడంలో ఆయన కృషి మరువలేనిది సిఐగా వచ్చిన తక్కువ కాలంలోనే యువతపై దృష్టి సాధించి చెడు అలవాట్లకు పోకుండా సన్మార్గంలో నడిపేందుకు యువకుల తల్లిదండ్రులకు యువకులకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి వారు మంచి మార్గంలో వెళ్లేందుకు తన వంతు కృషి చేశారు. అలాగే శాంతి భద్రతలను కాపాడడంలో ఎస్పీ, డి.ఎస్.పిల ఆదేశాలతో తన మార్కు చూపించారు. ఈ సందర్భంగా సిఐ పెద్దిరాజు మాట్లాడుతూ నాకు సహకరించిన ఎస్పీ, డి.ఎస్.పి వారికి మరియు నా తోటి సిబ్బందికి కృతజ్ఞతలు అని, నాకు సహకరించినవారికి ధన్యవాదాలు అని తెలిపారు.

ఈనెల 30 నుండి మాఘ మాస మహోత్సవాలు

- సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పుల్ల శ్రీరాములు
- మీడియా సమావేశంలో

కార్య నిర్వ హణాధికారి లక్ష్మీనారాయణ వెల్లడి

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : సర్పవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో మాఘమాస మహోత్సవములు ఈ నెల 30 వ తేదీ నుండి ఫిబ్రవరి 28వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి మాదిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్సవాలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాలు మేరకు ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో కమిటీ మెంబెర్స్ సిపార్సు చేసినట్లు ప్రకటించగా, కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 2వ, తేది మొదటి ఆదివారం తిరునాళ్ళు జరుగుతాయన్నారు. 4వ తేదీ మంగళవారం రథసప్తమి నాడు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే 8వ తేదీ శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం ఏకహం ఏర్పాటు చేశామన్నారు. అలాగే 9వ తేదీ రెండవ ఆదివారం తిరునాళ్ళు, 12వ తేదీ మాఘ పౌర్ణమి, 16వ తేదీ మూడవ విశేష ఆదివారం స్వామివారు వెలిసిన రోజు తిరునాళ్ళు, 23వ తేదీ నాల్గవ ఆదివారం తిరునాళ్ళు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 18వ తేదీ మంగళవారం నుండి 27వతేది గురువారం వరకు ద్రవిడ వేద అధ్యయన ఉత్సవములు వైభవంగా జరుగుతాయని ఈఓ లక్ష్మీ నారాయణ తెలిపారు. నాలుగు ఆదివారం లు ఇక్కడకు వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్న దానం ఏర్పాటు చేశామన్నారు.

అలాగే ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టమన్నారు. శానిటేషన్, డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉంటాయన్నారు. కోనేరులో స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చుట్టూ సిసి కెమెరాలు పెడతామన్నారు. కావున భక్తులు భావన్నారాయణస్వామి ఆలయ క్షేత్రాన్ని సందర్శించాలని కోరారు.

జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన దండాల రమేష్, రాధారాణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించారు. ఈవోభాగవతుల వెంకటరమణ మూర్తి ఆశీర్వచనం చేయించి,శ్రీస్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం అందించారు.

కాకినాడ జిల్లా ఎస్పీగా బిందు మాధవ్

- పదవీ బాధ్యతలు స్వీకరణ

కాకినాడ,మేజర్న్యూస్ : శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పని చేస్తుందని, సామాన్యులకు న్యాయం అందేలా అందరికీ అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించడం జరుగుతుందని నూతన ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. సామర్లకోట కుమార భీమేశ్వరస్వామిని దర్శించిన అనంతరం సోమవారం వేద పండితుల ఆశీర్వచనాలు నడుమ నూతన జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. నూతన ఎస్పీ బిందు మాధవ్ ను కాకినాడ జిల్లా లోని అదనపు ఎస్పీలు, కాకినాడ, పెద్దాపురం ఎస్‌డిపివోలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీస్ అధికారులు నూతన ఎస్పీ ని కలిసి అభినందనలు తెలిపినారు.

ఎలక్ట్రీషియన్ వృత్తి అభినందనీయం

- ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : ఎలక్ట్రీషియన్ వృత్తినే జీవనోపాధిగా ఎంచుకొని ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ అందరికీ వెలుగులు పంచడం అభినందనీయమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. జనవరి 27వ తేదీ నేషనల్ ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా కొవ్వూరు పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఎలక్ట్రిషన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విద్యుత్ బల్బులను కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురు చూడకుండా చేతువృత్తులను నేర్చుకొని ఉపాధి పొందడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తుదారులకు ప్రోత్సహిస్తూ ప్రజలకు చేతి వృత్తిదారులకు మధ్య వారిదిగా యాప్ ను ప్రవేశపెట్టి చేతివృత్తిదారులకు అండగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షులు రొంగల హరీష్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఎస్పీ. వెంకన్న, గౌరవ సలహాదారులు జాగారపు వీరబాబు, ఉపాధ్యక్షులు జమ్మూ సూరిబాబు, కార్యదర్శి వాడ శ్రీ గణేష్ సహాయక కార్యదర్శి చిన్నప్ప శ్రీను వాస్, కోశాధికారి ఎ.జి.ఎస్. వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికై ఐటీడీఏను ముట్టడించిన స్కీమ్ వర్కర్లు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో అంగన్వాడీ, ఆశా వర్కర్స్, స్కూలు శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ఆందోళనలు చేసి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి విన్నవించుకున్నా సమస్యలు పరిష్కారం చేయడంలో అధికారులందరూ విఫలం అయ్యారని విసుగు చెందిన కార్మికులు అసహనంతో సోమవారం రోడ్డు మీదికి వచ్చి ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు. రంపచోడవరం సిఐటియు కార్యాలయం నుండి నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడారు. కార్మికులందరూ రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆందోళన వద్దకు వచ్చిన సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి యూనియన్ నాయకులతో చర్చలకు అంగీకరించడంతో పాటు అనంతరం పెట్టిన డిమాండ్లన్నీ పరిష్కారం చేస్తామని ఆమె ఇవ్వడంతో ఆందోళన విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శాంతి రాజు, అంగనవాడి హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి నిర్మల, జిల్లా కోశాధికారి కే.రామలక్ష్మి, కె.రాణి, కే.వెంకటలక్ష్మి, ప్రసన్న, ఆశ యూనియన్ జిల్లా నాయకులు కలీంకోట రమణమ్మ, కొమరం చెల్లాయమ్మ, ఎస్.మంగాయమ్మ. సారపు, వెంకటలక్ష్మి. స్కూలు సానిటేషన్ యూనియన్ నాయకులు. కె విజయ కుమారి, పి.కుమారి, చోడి, లక్ష్మీ ప్రసన్న కుమారి, అంగనవాడి, ఆశ వర్కర్స్, స్కూలు సానిటేషన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫూల్ క్యాంపస్ డ్రైవ్

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం ఉదయం ఐఐఐపి&టి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెనేట్ హాలు నందు మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులకు (పురుష) తిరుచ్చిలోని శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఫూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా శ్రీ సాయిపవర్‌అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ ని, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్‌లను విసి ఛాంబర్ నందు కలువగా జెఎన్‌టియుకెతో పాటు డిగ్రీ కళాశాలల నుండి ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకుని తమ లక్ష్య సాధనకు ముందడుగు వేయాలన్నారు. అలాగే శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రొఫైల్‌ను వివరించి తాము చేపట్టే ఫూల్ క్యాంపస్ డ్రైవ్ వివరాలను తెలియజేశారు. ఈ ఫూల్ క్యాంపస్ డ్రైవ్‌లో తిరుచ్చి నుండి శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఐఐఐపి&టి డైరెక్టర్ ప్రొ.బి.టి.కృష్ణ తెలిపారు. జెఎన్‌టియుకె మరియు డిగ్రీ కళాశాలల నుండి సుమారుగా 120 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా మెకానికల్ ఇంజనీరింగ్ నుండి ఏడుగురిని, కెమికల్ ఇంజనీరింగ్ నుండి 10మందిని, కెమిస్ట్రీ నుండి 9మందిని, సేఫ్టీ నుండి ఒకరిని మొత్తంగా 27మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు దేశంలోని కంపెనీకి సంబంధించిన 35 ప్రాజెక్ట్‌లలో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఫూల్ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులకు ఐఐఐపి&టి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెనేట్ హాలు నందు వ్రాత పరీక్ష నిర్వహించి ప్లేస్‌మెంట్ ఆఫీస్ మరియు సెనేట్ హాలు నందు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ సాయి పవార్, హెచ్‌ఆర్ మేనేజర్ ఎన్.గోపి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్ ఏ.రిచర్డ్, ప్లేస్‌మెంట్ పోకస్-ఫౌండర్ కె.మనోజ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ షేక్ మహ్మద్ నసీరుద్దీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వినోద్ మిశ్రా డిమాండ్

ఏలేశ్వరం,మేజర్న్యూస్: సాగులోఉన్న గిరిజనుల కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, హైకోర్టు ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని చెప్పుకుందాం అనివెళ్లిన గిరిజనులకు ఏలేశ్వరం మండల తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులుఎవ్వరూ లేరు దిక్కులేని పరిస్థితిలో సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రానాయకత్వంలో ఏలేశ్వరం మండలం గిరిజనులు.కార్యాలయం వద్ద నిరసననిర్వహించారు.

ఈ సందర్భంగా లైబ్రేషన్ వినోద్ మిశ్రా పార్టీ ఆర్మీజింగ్ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వర రావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా. ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామ కొండ కమ్మరి కులానికి చెందిన 60 మంది ఎస్టీలు. మర్రివీడు పంచాయతీ పరిమితడక గ్రామ కొండ దొర కులం చెందిన ఎస్టీలు 90 మంది. కలిసి మండల సరిహద్దులో గల. అడ్డతీగల మండలం 59 కొత్తూరు పాడు గ్రామ పరిధి రాజవంమంగి అటవీ రేంజ్ లో కొండపోడు భూమి ఒక్కొక్క కుటుంబం 3 ఎకరాలు. లేక 4 ఎకరాలు చొప్పున సాగు చేసుకుంటూ జీడి మామిడి తోట వేసుకుని జీవిస్తున్నారన్నారు. రంపచోడవరం. పెద్దాపురం. అధికారుల వద్దకు పలుమార్లు తిరిగి చివరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ఆర్డర్ ఇచ్చినప్పటికీ కాలయాపన చేస్తూ పెద్దాపురంలో ఆర్డీవో లేనందున. తిరిగి ఏలేశ్వరం ఎమ్మార్వో ని కలవమని పెద్దాపురం ఆర్ డి ఓ ఆఫీస్ ఏవో పంపించగా తేదీ.27-1-2025.. సోమవారం. 2. గంటల 30 నిమిషాల సమయంలో ఏలేశ్వరం మండల్ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ గాని డిప్యూటీ తాసిల్దార్ గాని .బి. గుమస్తా గాని సి.గుమస్తా గాని. ఎవ్వరు ఆఫీసు నందు లేరు. అటెండర్ మాత్రం గేట్ వద్ద కూర్చుని ఉన్నాడు. వారికి విషయం చెప్పడం జరిగింది.సత్సాహంతో అన్నవరం. పరిం తడక గ్రామాల గిరిజనులు కన్నీళ్లు పెట్టుకుని మా బ్రతుకులు ఆఫీసుల చుట్టూ తిరగడమేనా అంటూ సోమవారం రోజు స్పందన రోజు కూడా ఎవరు లేనందున ఆవేదన వ్యక్తం చేశారు. కావున గిరిజనుల కొండపోడు భూముల. రిపోర్టును పెద్దాపురం ఆర్డిఓ ఆఫీస్‌కి పంపకుండా రంపచోడవరం పిఓ ఆఫీస్ కి పంపడం వల్ల మా సమస్య మొదలుకొచ్చింది. ఈ విషయాన్ని మళ్లీ మేము హైకోర్టు న్యాయస్థానాన్ని ఆశ్రయించి అధికారులపై కోర్టు ధిక్కరణ కేసుగా నమోదు చేయాలని గిరిజనులు నిర్ణయించుకుని ఏలేశ్వరంమండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు,నాగులపల్లి అర్జునుడు మాడెం బాబురావు,తీగల రాజారావు,బలువు చెన్నయ్య, జిగటాపు రాజబాబు, పినపర్తి రాంబాబు, చింత దేవి వెదురుపల్లి ప్రభ తీగల వీరబాబు,గడపలమంగా డోర్ వెంకన్న బాబు, చింత వెంకయ్యమ్మ రేపల్లె పేరంటాలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

శ్రీ సత్యదేవుని దర్శించుకున్న కోడూరి ఎమ్మెల్యే శ్రీధర్

అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంకి కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శనార్థం సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి,అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా దేవస్థాన అధికారులు శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఈతకోట టోల్ ప్లాజా వద్ద నేడు ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం,మేజర్న్యూస్ : 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలులో భాగంగా నేడు (మంగళవారం) ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు ఈతకోట టోల్ ప్లాజా ఆవరణంలో రాజమండ్రి వేద హాస్పిటల్ వారిచే ఆర్థోపెడిక్ & స్పైన్ స్పెషలిస్ట్ డాక్టర్ తేజో ఫణింద్ర, గైనిక్ స్పెషలిస్ట్ డాక్టర్ లక్ష్మి మృదుల సంబంధించిన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క సిబ్బంది మరియు స్థానిక ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలి అని కోరడమైనది.

సిఎస్ నుండి అవార్డు అందుకున్న తహశీల్దార్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గం నుండి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్టర్‌గా ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతులు మీదుగా అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందని రంపచోడవరం తాసిల్దార్ పి.రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రాల్ రిజిస్టర్ గా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ప్రోత్సాహంతో ఓటర్ల జాబితాలో కొత్తవారిని ఓటర్లుగా గుర్తించడం, అదేవిధంగా ఓటర్ల జాబితాలో తప్పులున్న వాటిని మార్పులు చేర్పులు జరిగిందని ఆయన తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లు కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనలు ప్రకారం అప్లోడ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవార్డు రావడంలో సహకరించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, రంపచోడవరం సబ్ కలెక్టర్, అధికారులు సిబ్బంది ఈ ప్రాంత ఓటర్లకు తహశీల్దార్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.